క్లుప్తంగా

శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష


శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్డీఓ వెంకటరమణ

కుక్కునూరు: శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై గురువారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో జంగారెడ్డిగూడెం ఆర్డీఓ వెంకటరమణ వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కుక్కునూరు, పెద్దరావిగూడెం శివాలయాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, వారికి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలంలోని దాచారం గోదావరి రేవు మీదుగా కూనవరం మండలం కుమారస్వామి గుట్టకు వెళ్లేందుకు పడవల ఏర్పాటుకు అనుమతి లేదన్నారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం


కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఈవోపీఆర్డీ రత్నకుమార్

లింగపాలెం: మండలంలో ఇంటి పన్నులు వసూలు మార్చి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని ఈవోపీఆర్డీ రత్నకుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి, సంక్షేమం, ఇంటి పన్నులు వసూలుపై సమీక్షించారు. డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జ్ఞానజ్యోతి శిక్షణ పరిశీలన


శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ సురేష్‌బాబు

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని పోలవరం ఎంఈఓ జె.సురేష్ బాబు గురువారం సందర్శించారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో డీఆర్పీలు మూర్తి, వజీర్, స్వామి అయ్యప్ప, రాణి, మాధవి, విజయకుమారి గార్లు పాల్గొన్నారు.

ఆక్సిజన్ మెషీన్ వితరణ


ఆక్సిజన్ మెషీన్‌ను అందిస్తున్న దాత రాము

ద్వారకాతిరుమల: శ్రీవారి ప్రాణదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఉచిత ప్రథమ చికిత్సా కేంద్రానికి హైదరాబాద్‌కు చెందిన మేడి ఈస్ట్ కంపెనీ యజమాని రాము గురువారం రూ.లక్ష విలువైన ఆక్సిజన్ కాన్సులేటర్ యువెల్ 7ఎఫ్–10 (మెషీన్)ను అందజేశారు. ఆక్సిజన్ మెషీన్‌ను ఆలయ ఏఈఓలు పి.నటరాజారావు, ఆర్.లక్ష్మణ స్వామి, ప్రథమ చికిత్సా కేంద్రం వైద్యులు రాజేంద్రప్రసాద్‌లకు అందించారు. భక్తుల సౌకర్యార్థం దీన్ని వినియోగించాలని దాత కోరారు. తొలుత స్వామి, అమ్మవార్లను రాము, కంపెనీ సిబ్బంది దర్శించుకున్నారు. దాతను ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తుల అదృశ్యం


జువ్వ దుర్గారావు

టి.నరసాపురం: మండలంలోని సింగరాయపాలెం గ్రామానికి చెందిన జువ్వ దుర్గారావు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. దుర్గారావుకు రెండేళ్ల క్రితం వివాహమైందన్నారు. అప్పులు బాధతో ఈనెల 19న ఇంటి నుంచి బయటకొచ్చిన దుర్గారావు, జంగారెడ్డిగూడెం పట్టణశివారు కరాటం వై.జంక్షన్ వద్ద మోటార్ సైకిల్‌ను ఉంచి తాను చనిపోతానని కుటుంబసభ్యులకు మెసేజ్ పెట్టి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ కావడం, దుర్గారావు ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. దుర్గారావు ఆచూకీ తెలిస్తే సెల్ నెంబర్ 94407 96676కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. పట్టణానికి చెందిన భైరవ రాజేష్ రోజూ తాగి వచ్చి భార్య కావేరిని, ఇద్దరు పిల్లలను కొడుతున్నాడన్నారు. ఈ నెల 13న తాగి వచ్చి గొడవ చెయ్యగా కావేరి మందలించిందన్నారు. 14వ తేదీ ఉదయం రాజేష్ బయటకెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాకపోవడంతో గురువారం కావేరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

పంటల పండుగలకు వేళాయె


గోగుమిల్లిలో పండుగ కోసం ఇళ్ల వద్ద పెంచిన చిక్కుడు పాదులు


అంతర పంటగా ఉన్న కంది, జొన్న


ముంజులూరులో కొయ్యకుండా ఉంచిన చిక్కుళ్లు

- దేవతలకు నైవేద్యంగా సమర్పించాకే తినడం ఆనవాయితీ
- ఇంటికో కోడితో మొక్కు చెల్లింపు
- గిరిజన గ్రామాల్లో సందడి

బుట్టాయగూడెం: ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో పంటల పండుగల సందడి నెలకొననుంది. కొండలపై నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవించే కొండరెడ్డి తెగలకు చెందిన ఆదివాసీ గిరిజనులకు పోడు వ్యవసాయమే జీవనాధారం. సామలు, జొన్నలు, రాగులు, కొర్రలు, కందులు, వరి తదితర పంటలను పండిస్తారు. ఈ పంటలు చేతికొచ్చినా గిరిజనులు ముట్టుకోరు. కొత్త పప్పుల పండుగ, బాట పండుగలను ఎంతో వైభవంగా చేసి ఆ పండగల్లో ముందుగా వన దేవతలకు నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం ఆ పంటలను గిరిజనులు ఆహారంగా స్వీకరిస్తారు. ఈ విధానం తరతాలుగా గిరిజన గ్రామాల్లో వస్తున్న సంప్రదాయం. వేసవి కాలం వచ్చిందంటే చాలు గిరిజన గ్రామాల్లో కొత్త పంటల పండగల సందడి నెలకొంటుంది. ఫిబ్రవరి నెల నుంచి మే నెలాఖరు వరకు గిరి పల్లెల్లో పప్పుల పండుగలు నిర్వహిస్తారు. పంటలు సంవృద్ధిగా పండి దిగుబడులు బాగా వచ్చేలా దీవించాలని వన దేవతలను పూజిస్తారు.

చిక్కుడు, చింత పండుగ

కొండరెడ్డి గిరిజన గ్రామంలో ప్రతి ఇంటి వద్దా తప్పనిసరిగా చిక్కుడు పాదులు పెంచుతారు. చిక్కుడు కాయలు కాచినా పండుగ చేసే వరకు వాటిని ముట్టరు. బయట నుంచి వచ్చిన వారిని ముట్టుకోనివ్వరు. వన దేవతకు నైవేద్యం పెట్టిన తర్వాతే చిక్కుడు కాయలను తింటారు. అలాగే చింతచెట్లకు పండుగ చేసాకే చింత కాయలు కోస్తారు.

వనదేవతలకు పూజలు

ప్రతి ఉగాది పండుగకు గ్రామంలోని గంగానమ్మతో పాటు వనదేవతలను గిరిజనులు పూజిస్తుంటారు. మామిడికాయ పండుగను వైభవంగా చేస్తారు. ఈ పండుగను కోయ, కొండరెడ్డి గిరిజనులు రెండు తెగల వారు చేస్తారు. దేవతలకు దూప, దీప నైవేద్యాలతో ఘనంగా పూజలు చేసిన తర్వాతే చెట్టు నుంచి మామిడి కాయలను కోస్తారు. ఇంటికో కోడిని తీసుకొచ్చి గ్రామదేవతకు మొక్కుగా ఇస్తారు. అనంతరం ఆ కోళ్లను వండుకుని సహపంక్తి భోజనాలు చేస్తారు.

కిల నంజు, తాటి, జీలుగు కల్లు సేవిస్తారు

మామిడికాయ పండుగలో మరో ప్రాముఖ్యత ఉంది. దేవతలకు పూజల అనంతరం గ్రామంలోని చిన్నాపెద్దా అందరూ కలిసి ఒక గుజిడీ ఏర్పాటు చేసుకుంటారు. అక్కడ కిల నంజును తెచ్చుకుని లొట్లలో తాటి కల్లు ఏర్పాటు చేసుకుని జీడి, మామిడి ఆకులతో, దారకాయలతో ప్రతి ఒక్కరూ తాటికల్లు సేవిస్తారు. ఇది పూర్వం నుంచి వస్తున్న ఇక్కడి ఆచారం. మామిడికాయ పండుగలో తప్పనిసరిగా కల్లు సేవిస్తారు.

సంప్రదాయ నృత్యాలు

పంటల పండుగల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా గిరిజన సంప్రదాయ రేల నృత్యాలను, డోలు వాయిద్యాల దరువుల చేస్తారు. ఎంతో లయబద్ధంగా రేరేలయ్య రేరేలా అంటూ గ్రామ దేవత గుడి, చెట్టు చుట్టూ నృత్యం చేస్తూ తిరుగుతారు. ఈ నృత్యాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి.

పండుగ చేశాకే తింటాం



మామిడికాయ, జొన్న, రాగులు, చిక్కుళ్లు, కందులు పంటలు చేతికి వచ్చిన తర్వాత వనదేవతలకు నైవేద్యంగా పెట్టిన తర్వాతే వీటిని తినడం మా సంప్రదాయం. ఈ ఏడాది కూడా పండుగలకు సిద్ధమవుతున్నాం. వేసవి కాలంలో చిన్నా, పెద్దా అందరం కూడా సంతోషంగా ఈ పండుగ చేసుకుంటాం.

– చంద్రు వెంకటరెడ్డి, చింతకొండ, పోలవరం మండలం

వనదేవతలను పూజిస్తాం



వన దేవతలను పూజించడం పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయం. మేము పండిచిన పంటలకు పండుగలు చేసి వన దేవతలకు నైవేద్యంగా సమర్పించిన తర్వాతే ఆ పంటలను తింటాం. నేటికీ ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం.

– కె.చిన్నారెడ్డి, ముంజులూరు, బుట్టాయగూడెం మండలం

అడవుల సంరక్షణే లక్ష్యం


బుట్టాయగూడెంలో అడవులను పరిశీలిస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: అడవుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని జంగారెడ్డిగూడెం అటవీశాఖ డీఎఫ్ఓ వెంకట సుబ్బయ్య అన్నారు. మండలంలోని ముంజులూరు, ఒర్రింక, చింతకొండ, కర్రిపల్లి ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. అయా ప్రాంతాల్లో ఉన్న చెట్లను, ల్యాగింగ్‌కు వెదురు నరుకు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల పెంపకానికి ఈ ఏడాది ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం అటవీప్రాంతంలో ఉన్న నల్ల మద్ది, టేకు, రోజ్‌వుడ్‌తోపాటు తదితర కలప పంటల జాతులతోపాటు పండ్లు ఇచ్చే మొక్కలు కూడా ఉన్నాయని తెలిపారు. వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే కన్నాపురం రేంజ్ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి కలప అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామని చెప్పారు. అటవీ ప్రాంత పర్యాటక ప్రదేశాల్లో పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి శివరామకృష్ణ, డీఆర్ఓ జె.ప్రభాకర్, బీట్ ఆఫీసర్ నవతేజ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

చింతలపూడి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ చింతలపూడి నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులుగా 27 మంది నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. యూత్ వింగ్ అధ్యక్షులుగా మిరియాల దిలీప్, మహిళా విభాగానికి కనమతరెడ్డి చండీప్రియ, రైతు విభాగానికి అలవాల ఖాదర్‌బాబు రెడ్డి, బీసీసెల్‌కు మగసాని గురుబ్రహ్మ, ఎస్సీ సెల్‌కు ననంపూడి ధర్మరావు, ఎస్టీ సెల్‌కు వి.కోట్లు, మైనార్టీసెల్‌కు షేక్ అక్బర్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు వీపీడీ లివింగ్‌స్టన్, విద్యార్థి విభాగానికి కాసర సుబ్బారెడ్డి, పంచాయతీ రాజ్ విభాగానికి నరెడ్ల బుజ్జిబాబు, మున్సిపల్ విభాగానికి గూడపాటి రాధాకృష్ణ, ఆర్టీఐ విభాగానికి షేక్ హీరాహకీం, వలంటీర్స్ విభాగానికి మత్తే శిరీష నియమితులయ్యారు. గ్రీవెన్‌సెల్‌కు గోలి శ్రీనివాస రెడ్డి, వాణిజ్య విభాగానికి నరిశెట్టి రామారావు, చేనేత విభాగానికి తమ్మిశెట్టి గిరిజ నాగ సరస్వతి, వైఎస్సార్ టీయూసీకి పరసా ప్రశాంత్, అంగన్‌వాడీ విభాగానికి నాత మరియమ్మ, లీగల్ సెల్‌కు తమ్మిశెట్టి నాగేంద్ర ఫణిదీప్, సాంస్కృతి విభాగానికి చిలుకూరి సుబ్బారావు, సోషల్ మీడియాకు బందెల ప్రభాకర్ ఆనంద్, ఐటీకి ఎర్రు శ్రీనుబాబు, దివ్యాంగుల విభాగానికి చొక్క నాగరాజు, డాక్టర్స్ వింగ్‌కు డాక్టర్ కోట సుబ్బారావు, మేధావుల ఫోరానికి రుద్రపాక నాగమల్లేశ్వరరావు, బూత్ కమిటీకి మొగల్పీడి వెంకటేశ్వరరావు, ప్రచార విభాగానికి మేరుగు బాబురావులు అధ్యక్షులుగా నియమితులయ్యారు.

విద్యారంగ సమస్యలపై వినతి


ఆర్డీఓ కార్యాలయ ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఏఓ జీసీఎన్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.3,500 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలని, పేద విద్యార్థులు ఉన్నత చదువులకు అడ్డంకిగా మారిన జీఓ 77ను రద్దు చేయాలని కోరారు. యూజీసీ డ్రాఫ్ట్ సవరణను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని తక్షణమే అమలు చేసి చేయాలని, ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, అన్ని రంగాల్లో ఉన్న 2.50 లక్షల పోస్టులను భర్తీ చేయాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ కమిటీ సభ్యుడు ఈ.భూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్, లా విద్యార్థి కె.విజయశేఖర్, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

యువతరానికి భక్తి విలువ తెలియజేస్తా

సినీ, బుల్లితెర నటుడు బాలాజీ


శ్రీవారి ఆలయ ఆవరణలో స్వామి క్యాలెండర్‌తో సినీ, బుల్లితెర నటుడు బాలాజీ

ద్వారకాతిరుమల: యువతరానికి భక్తి విలువలు తెలియజేసేలా వేంకటేశ్వరస్వామివారి సేవలో తరించిన భక్తాగ్రేశ్వరుడైన అనంతాళ్వార్ కథను సినిమాగా తీస్తానని ప్రముఖ సినీ, బుల్లితెర నటుడు బాలాజీ తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఈ సందర్భంగా బాలాజీ విలేకర్లతో మాట్లాడుతూ త్వరలో తాను అనంతాళ్వార్ చిత్రాన్ని తెరకెక్కిస్తానని, ఇప్పటికే కథ కూడా సిద్ధమైందని చెప్పారు. ప్రస్తుతం నటుల ఎంపిక జరుగుతోందని, ఈ చిత్రాన్ని ఇక్కడే ప్రారంభిస్తానని వివరించారు. శ్రీవారికి నిత్యం పూల మాలలు సమర్పించే అనంతాళ్వార్, ఆ స్వామివారి మీదకే గునపం విసిరారని, ఆ గునపం ఇప్పటికీ తిరుమల మహాద్వారం దాటిన తర్వాత కుడివైపు గోడకు వేలాడుతూ కనిపిస్తుందని చెప్పారు. ఎంతో భక్తి గల అనంతాళ్వార్ అలా ఎందుకు చేశారన్నది నేటి యువతరం తన చిత్రం ద్వారా తెలుసుకుంటారని వివరించారు. ఇప్పటి వరకు 250 చిత్రాల్లో నటించిన తాను, తమిళం, తెలుగు భాషల్లో 60 సీరియల్స్‌లో నటించినట్టు చెప్పారు.

రాజబాబు మృతి బాధాకరం


రాజబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కనకరాజు, తదితరులు

ద్వారకాతిరుమల: నిబద్ధతతో వైఎస్సార్ సీపీకి ఎనలేని సేవలు అందించిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు అకాల మృతి బాధాకరమని కామవరపుకోట మాజీ సొసైటీ అధ్యక్షుడు సాయన కనకరాజు అన్నారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో రాజబాబు నివాసంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు మేరుగు బాబురావు, ఆకుల అప్పారావు, మేడంకి చిన్నపద్మ, మహ్మద్ కన్నా, ప్రభాకర్, ఆనంద్, అన్నపనేని రాజశేఖర్, మానుకొండ దేవరాజు, బిరుదుగడ్డ మోహన్, బందెల చిట్టీబాబు, బట్ట సుబ్బు యాదవ్, రవి తదితరులున్నారు.

శ్రీశైలం మల్లన్నకు పట్టువస్త్రాల సమర్పణ


శ్రీశైలం మల్లన్నకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న శ్రీవారి దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తి

ద్వారకాతిరుమల: శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి వారికి ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం అధికారులు గురువారం పట్టు వస్త్రాలను సమర్పించారు. శివరాత్రిని పురస్కరించుకుని మల్లన్నకు నిర్వహించే బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఈ వస్త్రాలను అందజేశారు. తొలుత శ్రీవారి దేవస్థానం ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి దంపతులు పట్టు వస్త్రాలను శిరస్సుపై పెట్టుకుని అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ మల్లన్న సన్నిధికి చేరుకున్నారు. అక్కడి అధికారులకు వాటిని అందజేశారు. అనంతరం మల్లన్నను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఏటా బ్రహ్మోత్సవాల్లో మల్లన్నకు చినవెంకన్న దేవస్థానం పట్టు వస్త్రాలను ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో ఈఓ వెంట ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ట్రాఫిక్‌కు అంతరాయం


అల్లిగూడెం గ్రామం వద్ద బోల్తాపడిన ట్రాక్టర్

కుక్కునూరు : రోడ్డు నిర్మాణ పనుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలపాలిట శాపంలా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కుక్కునూరు – బూర్గంపాడు మధ్య ప్రారంభించిన ఆర్ అండ్‌బీ రహదారి పనులు అసంపూర్తిగా వదిలేయడం ప్రమాదాలకు కారణమైంది. రోడ్డు పై దుమ్ము కారణంగా ఇప్పటికే పలు ప్రమాదాలు సంభవించాయి. గురువారం రోడ్డు పై గుంతల కారణంగా జామాయిల్ లోడ్‌తో బూర్గంపాడు వెళ్తున్న ట్రాక్టర్ బొనగిరి – అల్లిగూడెం గ్రామాల మధ్య రహదారిపై బోల్తా కొట్టింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ కష్టాలు ఇంకెన్నాళ్లు పడాలని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాలు కల్పించాలి

ఏలూరు (టూటౌన్) : అమరావతిని ఫ్రీ జోన్‌గా చేసి 26 జిల్లాల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కో కన్వీనర్ తోర్లపాటి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక స్ఫూర్తి భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల తీర్మానాలను వివరించారు.

గుహాలయంలో శివరాత్రి వేడుకలు


ఓంకారేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక రాజీవ్‌నగర్‌లో స్వయంభువుగా వెలిసిన ఓంకారేశ్వర గుహాలయ ప్రాంగణంలో మహాశివరాత్రి 8వ కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ గురువారం తెలిపింది. 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో అన్నపూర్ణ సహిత ఓంకారేశ్వరస్వామికి విశేష అభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొంది. ఉయదం 4.30 గంటలకు పూజలు ప్రారంభమవుతాయని, సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, మహాదేవునికి పూజలు, రత్నలింగ దర్శనం, కల్యాణ మహోత్సవం, కన్యాదనం కార్యక్రమాలు ఉంటాయని వివరించింది. మధ్యాహ్నం అన్నసమారాధన, లలితా విష్ణు సహస్రనామ పారాయణ, సాయంత్రం దీపోత్సవం, పల్లకీ సేవ, దశ శాంతి పారాయణం, రాత్రి ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 12 గంటలకు లింగోదర్శనం ఉంటుందని వివరించారు. ఉదయం 8.30 గంటలకు నిర్వహించే శివపార్వతుల కల్యాణంలో పాల్గొనే దంపతులు సెల్ నెంబర్లు 94411 01804, 94403 62337 సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రజల గొంతు వినిపించకుండా కుట్ర

ద్వారకాతిరుమల: అధికార పార్టీ మొదటిసారిగా శాసన మండలిలో ప్రజల గొంతు వినిపించకుండా చేసేందుకు ప్రయత్నిస్తుండటం విచారకరమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు అన్నారు. ఉభయగోదావరి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి దొడ్ల వీరరాఘవులను గెలిపించాలని ఆయన కోరారు. పంగిడిగూడెం, ద్వారకాతిరుమల తదితర గ్రామా ల్లో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: ఎమ్మెల్సీ అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ గురువారం కొయ్యలగూడెంలో ప్రచారం నిర్వహించారు. తనను గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామవరపుకోట / పోలవరం రూరల్ : లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం విద్యుత్‌సరఫరా నిలిపివేస్తామని, ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. కామవరపుకోట సబ్‌స్టేషన్ పరిధిలోని లక్కవరం, యడవల్లి, ద్వారకాతిరుమల ఫీడర్లకు ఉదయం 9 మధ్యాహ్నం ఒంటి గంట వరకు, పోలవరం, గూటాల, పట్టిసీమ, రామయ్యపేట, ఇటికలకోట, కృష్ణారావుపేట పంచాయతీల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు..

టి.నరసాపురం / కొయ్యలగూడెం / చింతలపూడి : టి.నరసాపురం, మక్కివారిగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్లకు, కొయ్యలగూడెం, బోడిగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలో, చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

విద్యుత్ వేళల్లో మార్పు

లింగపాలెం: ధర్మాజీగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని మఠంగూడెం, తొచలకరాయుడుపాలెం, నడిపల్లి, ప్రగతిపురం, అయ్యప్పరాజుగూడెం (వ్యవసాయం) ఫీడర్లకు శుక్రవారం తెల్లవారు జాము 2 నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. బాపిరాజుగూడెం, కేఆర్‌పాలెం–1, కేఆర్‌పాలెం–2 ఫీడర్స్‌కు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు, మిగిలిన గ్రామాలకు రాత్రి 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు. వినియోగదారులు ఈ వేళలు గమనించి సహకరించాలని కోరారు.

రాత్రివేళల్లోనే వ్యవసాయానికి విద్యుత్ సరికాదు

ద్వారకాతిరుమల: వ్యవసాయ ఉచిత విద్యుత్ రాత్రి వేళల్లోనే ఇవ్వడం సరికాదని, గతంలోలా 9 గంటల విద్యుత్‌ను పగటి వేళల్లో సరఫరా చేయాలని మండలంలోని రామన్నగూడెంకు చెందిన మాజీ సర్పంచ్ పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ యిమ్మడి పృధ్వీతేజ్‌కు, ఇతర అధికారులకు గురువారం వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. గతంలో మూడు షిఫ్టులుగా పగటి వేళల్లో త్రీఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేసేవారని, గత వారం రోజులుగా కరెంటు షిఫ్టులుగా ఇస్తున్నారని వివరించారు. దీనికి వేకువజాము 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంటే 8 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారని, మిగిలిన గంట విద్యుత్‌ను అర్ధరాత్రి సమయాల్లో సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. దీంతో మొక్కజొన్న, నిమ్మ, కోకో తదితర పంటలకు తడులుపెట్టేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పేర్కొన్నారు. దీన్ని పరిశీలిస్తామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అంబేద్కర్ తెలిపారు.

నేడు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలవరం నియోజకవర్గ స్థాయి బాలబాలికల క్రీడా పోటీలు శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆర్గనైజర్, నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు, జెడ్పీ హైస్కూల్ పీడీ లాగు జయరాజు తెలిపారు. ఈనెల 21న బాలబాలికలకు అథ్లెటిక్స్, 22న బాలురకు కబడ్డీ, వాలీబాల్, కోకో, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 21న ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. పోలవరం, బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, ఏలూరుపాడు మండలాల నుంచి విద్యార్థులు పాల్గొంటారని వివరించారు.

వేలం పాట నిలిపివేయాలి

జంగారెడ్డిగూడెం: మండలంలోని మైసన్నగూడెం నూకాలమ్మ చెరువు వేలంపాటను నిలిపివేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ నీటి సంఘం పేరుతో పంచాయతీకి రావాల్సిన నిధులను సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. గత మూడేళ్లుగా అక్రమ పద్ధతిలో 13 ఎకరాల చెరువును లీజుకు ఇస్తున్నారని తెలిపారు. విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా సక్రమ పద్ధతిలో చెరువుకు వేలం నిర్వహించాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదు లీటర్ల సారాతో ఒడ్డురుగూడెంకు చెందిన మల్లె మారేశ్వరరావును అరెస్టు చేశామని సీఐ పి.అశోక్ తెలిపారు. రాఘవాపురంలో ఇంజమూడి రాంబాబు, భూక్యా శ్రీనులను అరెస్టు చేసి 25 లీటర్ల సారా, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితుడు ఇంజమూడి రాంబాబును తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశామన్నారు.

కుళ్లిన ఎగ్ పఫ్‌పై వివాదం


కుళ్లిన ఎగ్ పఫ్

ద్వారకాతిరుమల: బర్డ్ ఫ్లూ ఆందోళన వేళ ఓ బ్యాకరీలో కుళ్లిన ఎగ్ పఫ్‌ల విక్రయం వివాదాస్పదంగా మారింది. ఈ ఘటన ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పంచాయితీ పరిధిలోని ద్వారకానగర్ వద్ద గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. భీమడోలు మండలం పెదలింగంపాడు గ్రామానికి చెందిన పులిపాటి రాజు ద్వారకానగర్‌లోని ఒక బేకరీలో గురువారం రాత్రి ఎగ్ పఫ్‌లను కొనుగోలు చేసి, ఇంటికి తీసుకెళ్లాడు. పిల్లలు వాటిని తినలేక ఊసేశారు. రాజు వాటిని పరిశీలించి ఎగ్‌పఫ్‌లు కుళ్లిపోయినట్టుగా గుర్తించాడు. వెంటనే బేకరీ వద్దకు వెళ్లి వ్యాపారిని నిలదీశాడు. ఆ వ్యాపారి 'చేతనైంది చేసుకో' అని నిర్లక్ష్యంగా సమాదానం ఇచ్చాడు. జరిగిన ఘటనపై ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు రాజు తెలిపారు.